కథ

"అబ్బెబ్బే, లోకం ముందుకుపోతోందీ ముందుకుపోతోందీ అనుకోవటమేగానీ ఈ మనుషుల బుద్ధి మాత్రం వెనకబడే ఉందే అమ్మడూ" అంటూ వచ్చాడు మా కామేశం మామయ్య.

ఆయన నాకు వేలువిడిచిన మేనమామ వరస. ఈ ఊరే. ఏదో చిన్నపాటి గవర్నమెంటు ఉద్యోగం ఎక్కడెక్కడో చేసినా చివరికి సొంత ఊరు. సొంత ఇల్లు అని ఇక్కడికొచ్చి స్థిరపడ్డాడు. ఇద్దరు కూతుళ్ళు. సలక్షణంగా కాపురాలు చేసుకుంటున్నారు. ఊళ్ళో ఉన్న ఏకైక బంధువునని ఆయనకి నేనంటే అభిమానం. రోజుకొక్కసారైనా మా ఇంటికి వస్తుంటాడు.

ఆయన రావటాన్ని మా ఇంట్లోవాళ్ళందరూ ఇష్టపడతారు. ఎందుకంటే రాగానే మా పిల్లలిద్దరికీ 'చెప్పుకోండి చూద్దాం'లాంటి చిక్కుప్రశ్న వేసి వాళ్ళు చెప్పలేక తికమకపడుతుంటే ఒక తుంటరి సమాధానంతో దాన్ని సాల్వ్ చేసి నవ్విస్తాడు. లేదా మావాళ్ళే ఆయన చాదస్తంతో ఆడుకుని సంతోషిస్తుంటారు.

ఆ తర్వాత తావళం తిప్పుకుంటూ కూర్చునే మా అత్తగారి దగ్గరికి వెళ్ళి కూర్చుంటాడు. ఆవిడ తనకొచ్చే నొప్పుల్ని రోజుకోరకంగా వెళ్ళబోసుకుంటూంటే సానుభూతిగా వింటున్నట్టు నటిస్తాడు. అవును, రోజూ అవే వినాల్సొస్తే ఎవరైనా ఏంచేస్తారు మరి- ఆ తరవాత తనకు తెలిసిన గచ్చాకు పుచ్చాకు ప్రకృతి వైద్యమేదో చెప్పి ఆవిణ్ణి సంతుష్టిపరిచి లేస్తాడు.

ఇక నేనూ మావారూ మిగుల్తాం. సాధారణంగా కామేశం మామయ్య వచ్చేది మేమిద్దరం తీరుబాటుగా ఉండే సమయమే అయ్యుంటుంది.

మా పడక్కుర్చీ అంటే ఆయనకిష్టం. నేవాల్చిన ఆ పడక్కుర్చీలో హాయిగా వాలి తన వాక్‌బాక్స్‌ని తెరుస్తాడు.

టీవీ చానళ్ళు రోజుకో అంశాన్ని వెతికి పట్టుకుని చర్చావేదిక నిర్వహిస్తున్నట్టు ఏదో ఓ టాపిక్‌ని సంభాషణలో చొప్పించి దాన్ని వీలైనంత విశ్లేషించి చీల్చి చెండాడి చివరికి తనదైన విధానంలో దాన్ని ఎలా పరిష్కరించవచ్చో కూడా సునాయాసంగా చెప్పేస్తుంటాడు.

మామయ్య మంచి మాటకారి. ఎదుటివారిని నొప్పించకుండా తన వాదనని ఒప్పించగల చతురత ఉన్నవాడు. కొద్దిగా పెద్దవాడేగానీ యువకుడికుండాల్సిన ఆదర్శభావాలు కలవాడు. ఈ సమాజాన్ని పీడిస్తున్న రుగ్మతల్ని నిర్మూలించాలనీ, దురాచారాల్నీ దుర్మార్గాల్నీ ఎదిరిస్తూ ఉద్యమాలు నడపాలనీ, విప్లవాలు లేవదీయాలనీ ఉద్రేకమైన పదజాలంతో మాటల ప్రవాహాన్ని ఉరికిస్తాడు.

అదేమిటో ఆయన ఎంతసేపు మాట్లాడినా విసుగనిపించదు. మామయ్య చెప్పిందానికల్లా తలూపటానికి ఎప్పుడో ట్యూనయిపోయాం మేమిద్దరం. మరీ శ్రోతల్లా ఉండటం బావుండదని మధ్యమధ్య ఓ రెండు మాటలు ఆయనతో ఏకీభవిస్తూ అంటుంటాం. అంతే.

మేమిద్దరమేకాక ఇక్కడ ఆయనకింకో అభిమాని కూడా ఉంది - మాణిక్యం - మా ఇంట్లో పనిచేసే మాణిక్యం. మొక్కలకి నీళ్ళు పోస్తూనో సందెవాకిలి ఊడ్చి ముగ్గుపెడుతూనో మామయ్య చెప్పే ఉపన్యాసాలు వింటూ ఉంటుంది. 'మీరు భలేగా మాటాడుతారండీ బాబూ' అని మెచ్చుకుంటుంది - ఏదో అర్థమైపోయినట్టుగా. మామయ్య గొప్పగా చూస్తాడు.

ఈరోజు ఏమి విశేషాలు మోసుకొచ్చాడో అనుకుంటూ వరండాలోకి వచ్చాను. నేను చెప్పకుండానే పడక్కుర్చీ తెచ్చి వీధి వరండా అరుగుమీద వేసేసింది మా మాణిక్యం.


దాన్లో కూర్చోబోతూ "ప్రపంచం బాగుపడేదెట్లాగో తెలియట్లేదే అమ్మాయ్" అని ఉటంకించాడు తన బాధని మరోరకంగా.

"ఏమయింది మామయ్యా? " అడిగాను.

"అరె, మరీ ఇల్లే లోకమనుకుంటే ఎట్లా?

# స్ఫూర్తి

**- వలివేటి నాగచంద్రావతి**



ఊరంతా ఏకమై చెప్పుకుంటున్నా నీకు వినిపించలేదా? " ఆశ్చర్యపోయాడు మామయ్య.

మాది పల్లే పట్నం కాని ఊరు. పట్టుమని పది పదిహేను పేటలున్నాయేమో. ఏ వింతా విడ్డూరం జరిగినా క్షణాల్లో గాలిలా ఊరంతా వ్యాపించిపోతుంది. ఆశ్చర్యపడ్డాడంటే పడడా మరి - అయినా అంత సంచలనం కలిగించే వ్యవహారం ఏం జరిగింది చెప్మా!

"పోస్టాఫీసు వీధిలో మూర్తిగారమ్మాయి లేదమ్మా- ఆ అమ్మాయి ఓ సాయిబులబ్బాయిని లగ్గం చేసుకున్నాదంట" మా మాణిక్యం పజిల్ విప్పింది.

సరిగ్గా ఆ వీధికి వెనక సందులోనే మామయ్యవాళ్ళుండేది.

"ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నారంటే ఇదేమరి. ఇంకా చేసుకోలేదు. తండ్రి దగ్గర అర్జీ పెట్టుకుందంతే. కాదంటే ఇంట్లోంచి వెళ్ళిపోతానని బెదిరించిందట. గదిలోపెట్టి తాళం వేశారు".

మూర్తిగారమ్మాయి కల్యాణి చక్కటి పిల్ల. పెద్దగా పరిచయమైతే లేదుగానీ బాగానే తెలుసును నాకు. ఏ గుళ్ళోనో ఎదురుపడితే 'బావున్నారా ఆంటీ' అని మర్యాదగా పలకరిస్తుంది. బాగా చురుకైనది అని విన్నాను. ఇక్కడ ఇంటర్ వరకూ చదివి టౌన్‌లో వాళ్ళ మేనత్త ఇంట్లో ఉండి ఏవో కంప్యూటర్ కోర్సులు చేస్తోందట.

"బుద్ధిమంతురాలిలా కనిపిస్తుంది. అంత గ్రంథసాంగురాలా" అన్నాను నోరుజారి.

"ఏం చేసింది - అహఁ అంత తప్పిదం ఏం చేసిందీ అంటున్నాను" అన్నాడు మామయ్య వాదనకి దిగబోతున్నట్టు.

"అది కాదూ... మన సాంప్రదాయం మీరి పెద్దలమాట వినకపోవటం... కులం మతం చూసుకోకుండా ప్రేమా దోమా అంటూ..." నసిగాన్నేను. ఆయన వాదనని ఎటు తీసుకువెళతాడో తెలీక.

"అంతంత చదూలు చదివీ గ్నానం ఉన్న పిల్లకాయలే ఇట్టాంటి కూడని పన్లుచేసి కన్నోళ్ళకి తలవంపులు తెస్తావుంటే ఏమనుకోవాలె" మాణిక్యం ఇంకో మాట వేసింది నాకు వత్తాసుగా.

"నాకు తెలీకడుగుతానూ... మన సాంప్రదాయంలో లేనిది ఆ అమ్మాయేం చేసిందీ - చెప్పు వింటాను. పురాణాల్లో రుక్మిణీ, చరిత్రలో సంయుక్తా ప్రేమించలేదా? వాళ్ళ కథలు హరికథల్లో వర్ణిస్తూ చెబితే చెవులప్పగించి వింటావే - వాళ్ళని సమర్థించి ఇప్పుడీ అమ్మాయి చేసింది సరైనపని కాదనెందుకంటున్నావూ" అని ఆగి నావంక పులుకూ పులుకూ చూసి, "ఇక కులం మతం అంటావా - ఖండాలనే కాదు గ్రహాలనీ దాటేస్తున్న ఈ రాకెట్ యుగంలో ఇంకా కులమతాలేమిటమ్మాయీ. విద్యావంతురాలూ విజ్ఞత కలిగిన పిల్ల కాబట్టే తనకు తగినవాణ్ణి ఎంచుకోవటంలో స్వయం నిర్ణయాధికారం తీసుకుంది. నన్నడిగితే ఆ అమ్మాయి తప్పేం లేదంటాను" ఏకబిగిన ఇద్దరికీ సమాధానాలు చెప్పేశాడు మామయ్య.

"అదేవిటి మామయ్యా, పెళ్ళంటే పిల్లాణ్ణి ఎంచుకోవటమొక్కటేనా? పరువూ ప్రతిష్టా వంశగౌరవం ఎన్ని చూడాలి. పిల్లలేదో అనుభవంలేక చపలచిత్తంతో మోజుపడుతూంటే మనమూ సైయ్యనాలంటున్నారా? " ఈసారెందుకో మామయ్యకి వంతపాడాలనిపించలేదు.

"వంశమా గాడిదగుడ్డా - అంతా హంబక్ కాకపోతే ఏ తలకుమాసినవాడితో మన వంశం మొదలయిందో మనకేం తెలుసు చెప్పు. మా తాతలు నేతులు తాగారూ మా ముత్తాత పల్లకీలో ఊరేగాడూ - ఈ కుహనా గొప్పలూ గౌరవాలూ ఇప్పుడెవరిక్కావాలి. కాలానికి తగ్గట్టుగా పోవాలెప్పుడూ" అని నిట్టూర్చి, "నన్నడిగితే ఆ తిరుగుళ్ళూ ఈ తిరుగుళ్ళూ తిరక్కుండా సూటిగా మర్యాదగా 'నా సరిజోడితనూ' అని

చెప్పినప్పుడు హాయిగా ఆశీర్వదించి తమ పెద్దరికం నిలుపుకోవటం మంచిదంటాను. మన మూర్ఖత్వం వదిలిపెట్టి వాళ్ళ అభిరుచుల్నీ ఆకాంక్షల్నీ గౌరవించమంటాను". గట్టిగా తన అభిప్రాయం చెప్పేశాడు మామయ్య.

"అయితే ఆ పిల్ల పెద్దలు చేసేది పొరపాటంటారా బాబూ" భక్తిగా అడిగింది మాణిక్యం.

"అక్షరాలా. మనలో మనమాట - కట్నకానుకల ప్రసక్తిలేకుండా అల్లుడు దొరికితే ఎగిరి గంతెయ్యక, అక్కర్లేని బింకాలెందుకు చెప్పు ఆ మూర్తిగార్కి. హహ్హహ్హ" అంటూ నవ్వాడు మామయ్య.

"బాగా చెప్పేరు బాబూ" ఆమోదించింది మాణిక్యం.

నేనుమాత్రం ఔననలేదు, కాదనలేదు. నిర్లిప్తంగా వింటూండిపోయాను. ఔనుమరి, నాకూ ఎదుగుతున్న ఓ కూతురుంది. ఏమో ఎటుపోయి ఎటొచ్చినా 'అదిగో ఆరోజు సమర్థించావుగా' అనొచ్చును.

★ ★ ★

అక్కణ్ణించీ కల్యాణి ఇంట్లో జరుగుతున్న పరిణామం రోజుకో వార్తగా కామేశం మామయ్య కథనంతో మా ఇంట్లో విడుదలవుతోంది.

"విన్నావా. ఆ మూర్తి మేనల్లుడికి కబురు పెట్టాట్ట- ఉన్నపళంగా బయల్దేరి రమ్మని. అతగాడు దుబాయిలో దిక్కుమాలిన ఉద్యోగమేదో వెలగబెడుతున్నాట్టలే. నీకు తెలీదుగానీ ఒకప్పుడీ మేనల్లుడికి చదువూ సంధ్యా సరిగ్గా అబ్బట్లేదని వట్టివాజమ్మ అంటూ ఛీత్కరించేవాడీ మూర్తి. ఇప్పుడా బడుద్ధాయికే కాళ్ళుకడిగి కన్యాదానం చేస్తాట్ట. అదేమి తంద్రమ్మా- కూతురు నిక్షేపంలాంటి ఇంజినీర్ని ప్రేమిస్తే అదికాదని ఎక్కడో దుబాయి నుంచి ఆ మెకానిక్కుని రప్పించి మరీ కట్టబెట్టడమేమిటి చెప్పు తండ్రి నన్న అహంకారం కాకపోతే. బయటపడాలమ్మా బయటపడాలి. ఆ అజ్ఞానంనించీ ఆ అవివేకం నించీ బయటపడాలి". ఆ ఆవేశం మామయ్యది.

"మధ్యన ఆ అమ్మాయి బతుకు అధ్వాన్నమయిపోతోంది గదా బాబూ". ఈ విచారం మాణిక్యానిది.

ఆ మర్నాడు- "తిక్క మా బాగా కుదిరిందిలే" అంటూ వచ్చాడు మామయ్య.

టీ పెడ్తున్నాను మావారికి. మామయ్య గొంతు విని ఇంకో కప్పు కూడా ట్రేలో పెట్టుకుని వరండాలోకొచ్చాను. మావారి కొశ్చన్‌మార్క్ మొహం చూసి గావును, కేసు పూర్వాపరాలు విశదీకరిస్తూ ఎడ్యుకేట్ చేస్తున్నాడు మామయ్య.

"ఎవరికి మామయ్య తిక్కకుదిరిందీ? " అనడిగాను.

"ఇంకెవరికీ... ఆ మూర్తికి. తను పిలవంగానే ఆఘమేఘాలమీద ఎగిరొచ్చి తాళి కట్టేస్తాడు మేనల్లుడు అనుకున్నాడు. వచ్చింది అల్లుడు కాదు- చెల్లెలు. ముహూర్తం పెట్టించటానిగ్గాదు- మూటెంతిస్తావ్ అని బేరాలాడ్డానికి. మూడొంతుల ఆస్తి కొడుకు పేర రాసిస్తేనే పెళ్ళి లేకపోతే లేదు అందిట. ఎవణ్ణో వలచి లేచెళ్ళిపోతానంటున్న పిల్లని పెళ్ళాడాలంటే ఆమాత్రం పైనుపడుతుందందిట. కాళ్ళా వేళ్ళాపడినా లాభంలేకపోయిందిట. నెత్తిన చేతులు పెట్టుకు కూర్చున్నాట్ట మూర్తి. తీరిందా రంధీ".

"ఇంతకీ ఇదంతా మీకు..? " మావారి ఆరా.

"మా సుబ్రమణ్యం లేడూ, అతను నా చెవిని వేశాళ్ళే". ఆ సుబ్రమణ్యం మామయ్యకి స్నేహితుడు, ఆ మూర్తిగార్కి దూరపుచుట్టం. "నువ్వు చెప్పు అబ్బాయ్, నా అనుకున్నా నా కులం అనుకున్నా ఒరిగిందేమిటీ? ఇట్లా బొప్పికట్టాకనైనా మేలుకోవద్దూ. గాంధీగారేమన్నారు? మనిషికోసం మతం కానీ మతం కోసం మనిషి కాదన్నారు. అవునా. మనకు పుట్టిన పిల్లలు నయం. ఆ మాటలు పాటించి కులమతాల ఎల్లలు చెరిపేసి చేయీచేయీ కలుపుతున్నారు. 'నువ్వెందుకయ్యా పాతబూజు పట్టుకువేలాడ్డం' అంటాన్నేను. నువ్వేమంటావ్? " మామయ్య ప్రశ్న.

"మీరెప్పుడూ చిన్నవాళ్ళ పక్షానే ఉంటారు సుమా". మావారి అటూ ఇటూ కాని జవాబు. దానికి చిరునవ్వొకటి జోడింపు.

టీ తాగి లేచాడు మామయ్య. "ఔను, నేనెప్పుడూ వాళ్ళ పార్టీనే. వాళ్ళకోసం



ఏం చేయడానికైనా సిద్ధం" అంటూనే అప్పుడే వస్తున్న మా పిల్లల్ని చూస్తూ చెయ్యి పైకెత్తి "పిల్లలూ జిందాబాద్, వాళ్ళ ప్రేమలూ జిందాబాద్" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడు.

మొక్కలకి నీళ్ళు పోస్తున్న మాణిక్యం ఆ పని ఆపి ఆయనకేసి మంత్రముగ్ధురాలిలా చూస్తూండిపోయింది.

ఆ తర్వాత మామయ్య ఓ వారంరోజులపాటు ఊళ్ళో లేడు. పెన్షన్ పనేదో ఉండి సిటీకి వెళ్తున్నానని చెప్పాడు.

వరసగా నాలుగురోజులపాటాయన కనబడకపోయేసరికి ఏదో వెలితి అనిపిస్తోంది. మా అత్తగారైతే, "ఏమిటోనే అమ్మాయ్, కాముడు లేకపోతే బయట ప్రపంచకం ఏమయిపోతోందో గూడా తెలవట్లేదు" అని వాపోయారు.

మామయ్య వచ్చి లోకాభిరామాయణంలా చెప్తూంటే వింటాను తప్ప, ఊళ్ళో విషయాలు నాకంతగా పట్టవు. ఈసారి మాత్రం 'పాపం ఆ కల్యాణి సంగతి ఏమయిందో? ' అనుకున్నానొకటిరెండుసార్లు. 'హ్హా, ఎంత చదువుకున్నా ధైర్యసాహసాలూ తెలివితేటలూ ఉన్నా, ఆడపిల్ల ఎప్పుడో ఒకప్పుడు అబలే అవుతోంది. తనవాళ్ళే గదిలోపెట్టి బంధిస్తే ఏం చెయ్యగలదు? '

ఆరోజు సాయంత్రం పన్లోకొచ్చింది మాణిక్యం. మామూలుగా అయితే నూతి పళ్ళెంలో వేసిన అంట్ల దగ్గరికి సరాసరి వెళ్ళిపోతుంది. అలాకాక పొట్లపాదు దగ్గర కాయలచివర నేను రాళ్ళు కడుతూంటే అక్కడికొచ్చి నుంచుంది.

"ఏమిటే? "

"ఆళ్ళొచ్చేసినారంటమ్మా" గుసగుస. ఊళ్ళోకి తాలిబన్లు వచ్చేశారన్నంత ఎగ్జయిట్‌మెంట్ దాని మొహంలో.

"ఎవరే? "

"ఆళ్ళేనమ్మా. ఆ కల్యాణమ్మ లవ్వాడిన అబ్బాయి. ఆ బాబు తనవాళ్ళందర్నీ వెంటేసుకొచ్చేసినాడంట".

మూర్తిగారికి పాలుపోసే వెంకటమ్మ మా మాణిక్యానికి చిన్నత్త. చూసింది విశేషమయిందైతే దాన్ని కడుపులో దాచుకునుండిపోగలమా చెప్పండి. మాణిక్యానికి చెప్పేసి, ఆ వెంకటమ్మ బరువు దించేసుకుంది. మాణిక్యమేమో నాకు చెప్పడానికొచ్చేసింది. అదీ సంగతి.

దాని భాషలో అది చెప్పిన సమాచారం నా భాషలో నాకర్థమయిందేమిటంటే-

కల్యాణి ప్రేమించిన అబ్బాయి తన పెద్దవాళ్ళతో సహా మూర్తిగారింటికి వచ్చాడు. అల్లరి చిల్లరి వాణ్ణికాదనీ మంచి పదవిలో ఉన్న వాణ్ణేననీ ప్రాణంకన్నా మిన్నగా కల్యాణిని ప్రేమించాననీ పువ్వుల్లోపెట్టి చూసుకుంటాననీ పెళ్ళి చేయమనీ వేడుకున్నాడు.

వెంటొచ్చిన అతని కుటుంబసభ్యులు కూడా ఎంతగానో నచ్చచెప్పారట. 'మన కడుపున పుట్టిన బిడ్డలు వాళ్ళు. వాళ్ళ సుఖసంతోషాలే మనకు ఆనందం. మన ముసలి నమ్మకాలతో అర్థంలేని కట్టుబాట్లతో మనసులు కలిసినవారి కలలను కాలరాయటం న్యాయంకాదని రాజీపడి వచ్చాం. మీరు కూడా కాంప్రమైజయి వాళ్ళని కలపండి' అని ప్రాధేయపడ్డారట.

"ఇకనేం కథ సుఖాంతమన్నమాట" అన్నాను ఉత్సాహంగా.

"అయ్యో మీరొకరమ్మా. ఆ మూర్తిగారో పెడకొయ్య. ససేమిరా కుదరదన్నాడట. ఆ పక్కింటాయన్నీ ఈ పక్కింటాయన్నీ కేకేసి మరీ- అది తప్పు, ఇట్టాంటి పొరపాటు పనికి ఎవరూ ఒప్పుకోరు అని చెప్పించినాడంట. ఒక్కసారి కల్యాణమ్మని చూపించమంటే కూడా ఇనక నానామాటలూ అని వాళ్ళని వెళ్ళకొట్టినాడంట".

"అరరే, ఆ సమయంలో మామయ్యగానీ ఉండుంటే ఎంత బావుండేదీ - ఆ ఇరుగూ పొరుగూ పెద్దమనుషుల్లా కాకుండా ఆ మూర్తిగారు ఎంత అజ్ఞానంలో అంధకారంలో ఉన్నాడో తెలియజెప్పి బుద్ధి చెప్పి దారికి తెచ్చుండేవాడు గదా" నొచ్చుకున్నాను.

"అవునండమ్మా, బాబు ఉంటే చానా బావుండేది".

ఇంకేం చేస్తాం. అదీ నేనూ చాలా చాలా విచారిస్తూ ఉండిపోయాం.

★ ★ ★

మిరపకాయలు దిష్టి తీసి పొయ్యిలో వేసినట్టు ఘాటైన వార్తతో ఊరు గుప్పుమంది.

కల్యాణి లేచిపోయిందట.

ఒకళ్ళని సిగ్గిలచేసే ఇలాంటి కబుర్లు వినటానికే కాదు చెప్పడానికొక్కాడా భలే ఇంట్రెస్టిగా ఉంటాయ్. దారినపోతూ కూడా కేకేసి మరీ చెప్పిపోతున్నారు ఒక్కరొక్కరూ ఒక్కొక్క వివరమూ.

'రాత్రి టౌన్ నుంచి వచ్చే చివరి బస్సుకి ఒక పిలగాడు దిగాడమ్మా. ఎర్రగా ఎత్తసరిగా బాగా ఉన్నాడు. నాకప్పుడే అనుమానమొచ్చింది. తెలిసిన మొగమల్లే లేదే ఎవరింటికా ఇంత రాత్రి దిగాడూ అని'- మా సందు చివర బాదంచెట్టు ఇంట్లో అద్దెకుండే ప్రసాదరావు కదనం. బస్టాండులో కిళ్ళీకొట్టు అతనిది. ప్రప్రథమ రిపోర్ట్ అతనిదే.

'నిన్న అర్ధరాత్రి దాటిన తరవాత చూస్తే గదిలో ఉండాల్సిన కల్యాణి గాయబ్' మరో ఉత్సాహవంతుడి సేకరణ.

ఇక తరవాత నాకు మరి ఇంట్లోకి వెళ్ళే సందీయలేదు ఎవ్వరూ. వరసగా కాయగూరలమ్మే నాగులు, పోస్ట్‌మేన్ నరసింహం, రామ్మూర్తి మాస్టారు నాకు వినిపించిన కథనం ప్రకారం-

కల్యాణి గది ముందర కాపలా పడుకుంటు న్నాట్టే మధ్య వెంకటస్వామి. నిన్న అర్ధరాత్రి దాటిన తర్వాత 'ఎవరో గోడ దూకుతున్నారూ' అని కేకలుపెట్టాట్ట. చూస్తే గదిలో కల్యాణి లేదు. 'అలికిడయితే లేచాను. ఎవరో ఇద్దరు విరిగిన సందుల్లో కాళ్ళేసి గోడ ఎక్కుతూంటే చూశాను. నేను కేక వెయ్యంగానే ప్రహరీగోడ మీంచి ఒక్క దూకు దూకారవతలకి' అని చెప్పాట్ట.

క్షణంలో ఎలర్టయ్యారు ఇంట్లోవాళ్ళు. ఊళ్ళో మూర్తిగారి బలగం ఎక్కువే. నలుగురు బావ మరుదులూ పనివాళ్ళు కొందరూ ఓ పదిమంది దాకా కర్రలూ టార్చిలైట్లూ పట్టుకుని ఇల్లుఇల్లూ సందుసందూ గాలించటం ఆరంభించారు. బస్టాండులోనూ రైలు స్టేషన్లోనూ చూడమని తెలిసినవాళ్ళకి ఫోన్‌చేసి, కనిపిస్తే వదలవద్దని హెచ్చరించారు. ఊళ్ళోంచి వెళ్ళే ప్రతి రహదారి ముందరా మనుషుల్ని కాపలా ఉంచారు.

అయినా వాళ్ళు దొరకలేదు. ఎలా మాయమ య్యారో తెలీలేదు.

"అరె, అంత బందోబస్తు చేసినా ఒక్కరి కళ్ళా పడకుండా ఎలా తప్పించుకున్నారంటారూ- ఆశ్చర్యంగా ఉంది కదూ!"

ఇందాకట్నుంచీ విన్నది విన్నట్టుగా వీలైనప్పు డల్లా లోపలికొచ్చి పేపరు చదువుకుంటున్న మావారి చెవిలో ఊదుతున్నాను. టీవీ చూస్తున్న వాణ్ణి బలవంతాన బుర్రకథ వినమన్నంత చేదుగా వింటున్నారాయన. అయినాసరే, నేనాయన విసుగు పట్టించుకోదలచుకోలేదు.

ఏం చేయను. మామయ్య లేరు. మాణిక్యం కూడా నిన్నట్నుంచి పని ఎగ్గొట్టింది. ఎవరికీ చెప్పకుండా ఉండలేకపోతున్నాను మరి.

"ఔను, ఎవరికీ కనిపించకపోతే అది విచిత్రమే. కానీ వాళ్ళు నా కళ్ళబడ్డారు".

అన్నది మావారు కాదు. వెనక్కితిరిగి చూశాను. గుమ్మంలో మామయ్య.

"మామయ్యా మీరా?" అన్నాను సంభ్రమంగా. పొద్దుట్నుంచీ సంజయుడుగాక మరెవరి నుంచో భారతయుద్ధం వింటున్నట్టు అసంతృప్తి ఫీలింగు. ఆయన్ని చూడగానే ఎగిరిపోయింది.

"ఊర్నించెప్పుడొచ్చారు? మీరనేదేమిటి?" అయోమయం నాకు.

"రాత్రే వచ్చాలే. ఆ కల్యాణీ, ఆ ముస్లిం కుర్రాడూ దాక్కోడానికి ముందు తట్టింది మా తలుపే" అన్నాడు మామయ్య గంభీరంగా.

"అవునా?" పోన్లే పాపం, భద్రమయిన చోటికే చేరారు.

మిగతాది చెప్పమన్నట్టు చూశాను.

"తక్షణం ఇక్కణ్నుంచి వెళ్ళిపొండన్నాను. ఆలస్యం చేస్తే వాళ్ళవాళ్ళని పిలిచి అప్పగించేస్తా నన్నాను. వెళ్ళిపోయారు".

స్తన్నయిపోయాను. 'మామయ్యేనా ఈయన?'

"అవునమ్మా, లేనిపోని తంటసం మనకెందుకు చెప్పు. ఇద్దరి పెద్దలూ తక్కువైనవాళ్ళు కాదు. మందీ మార్బలం, ఆస్తీ అంతస్తూ ఉన్నవాళ్ళు. రెండు ఆంబోతుల పోట్లాట మధ్యకి వెళ్ళిన లేగదూడ నలిగిపోయిందనీ, వీళ్ళకి ఆశ్రయ మిచ్చి నేనెందుకు నిష్ఠూరపడాలి. అందుకే...



ఆ తర్వాత వాళ్ళేమయ్యారో నాకు తెలీదు".

షాక్- తగిలింది నాకు.

★ ★ ★

మర్నాడొచ్చింది మాణిక్యం. మామయ్య కూడా అప్పుడిక్కడే ఉన్నాడు. దాన్ని చూడగానే పరమానందమయింది నాకు.

ఊళ్ళోవాళ్ళ గురించి గరంగరం చర్చలు జరిగే వేళల్లో మాకు ముఖ్యమైన పార్ట్‌నర్ అదే గదా!

"సరిగ్గా ఇప్పుడే పెట్టావు నాగా- ఒక్కరోజులో ఎంత వింత విడ్డూరం జరిగిపోయిందో తెలుసా నీకు" అన్నాను.

"మీ ఇచ్చిత్రం తరవాత చెబుదురు. మీరులి క్కిపడే మాట నే చెబుతా వినుకోండి" అంది మాణిక్యం చిర్నవ్వుతో.

అందరం దానికేసి తిరిగాం.

అటూ ఇటూ పారజూసి స్వరం తగ్గించింది మాణిక్యం. "మొన్నరాత్రి కల్యాణమ్మా, ఆ సాయిబులబ్బాయీ మా ఇంటికొచ్చారు".

"ఆc..!" నోళ్ళు తెరిచేశాం.

"ఉష్షు... నెమ్మదిగా... మా ఇంటికంటే మా ఇంటిగ్గాదు. మా చిన్నత్త వెంకటమ్మ లేదూ- ఆల్లింటికి వచ్చారు".

ఉలుకూ పలుకూ లేదు మా దగ్గర. మరోసారి చుట్టూరా చూసి ప్రారంభించింది మాణిక్యం.

"మా చిన్నత్త కూతురికి నొప్పులొస్తున్నాయని సాయానికి రమ్మంటే పనికి నాగాపెట్టి వెళ్ళాను. ఆ రాత్రి వాళ్ళింట్లోనే పడుకున్నాను. ఓ రాత్రి వేళ నక్కుతూ నక్కుతూ వచ్చారిద్దరూ".

"వాళ్ళ ఎనకమాలే తరుముతూ మనుషులొస్తు న్నారట. దణ్ణాలెడుతూ సాగిలపడ్డారిద్దరూ- మీరే దిక్కని. మా అత్త బయంపడ్డది- పెద్దోళ్ళ యవ్వారం అని. తల గొడతారా ఏమి- అదీ సూద్దాంలే అత్తా అని నేనే ఒప్పించినాను".

"మా మరిది నాకు సైయ్యనినాడు. వాళ్ళ స్నేహితుణ్ణడిగి గూడురిక్షా తెచ్చినాడు. దానికి రెండుపక్కలా తెరలు కట్టినాము. మద్దిన కల్యాణమ్మని కూచోపెట్టి ఒకపక్క సూలింత రాలూ రెండోపక్క నేనూ ఆ అమ్మను కప్పుతూ కూచున్నాం. వెనక మా అత్త నడిచింది".

"ఆ సాయిబులబ్బాయికి పాగా చుట్టినం. పాతచొక్కా తొడిగినం. మా మరిది మోపెడ్ మీద వెనకన కూచుండబెట్టుకుని బయలెళ్ళినం. ఈళ్ళని వెతికేటోళ్ళొచ్చినారుగానీ మా ఆడబొట్టి మూలుగులూ మా మొగవాళ్ళ సమాధానాలూ నమ్మినారు. మరిక మా జోలికి రాలేదు".

"సరాసరి పట్నం పోయినం. ఆళ్ళని రిజిస్ట్రరా ఫీసుకీ మా ఆడబిడ్డని ఆస్పత్రికీ చేర్పినం. సాయంత్రం లోపల ఆళ్ళిద్దరికీ పెళ్ళయింది. మా ఆడబిడ్డ మగబిడ్డని బూమ్మీదకి ఒదిలింది. అంతా సుకంగున్నారు. రాత్రే మా ఆడబిడ్డనీ దాని బిడ్డనీ తీసుకుని ఇంటికి వచ్చేసినం" ముగించింది మాణిక్యం.

రూపుకట్టిన ఓ అద్భుతాన్ని చూస్తున్నట్టు రెప్ప వాల్చటం మరిచిపోయి చూశాను మాణిక్యాన్ని.

కుచ్చిళ్ళు దోపి అతి సామాన్యురాలిలా నుంచొన్న ఈ మనిషికి ఎంతటి ఇన్‌స్పిరేషన్ లేకపోతే ఇంతటి అసాధ్యాన్ని సాధించగలుగు తుంది!

"ఇంత తెలివి, ఇంత ధైర్యం నీకెలా వచ్చిందే?"

మాణిక్యం మా కామేశం మామయ్యకేసి తిరిగింది. రెండు చేతులూ జోడించి నుదుటికి తాకించుకుంది.

"ఈయనేనమ్మా, నాగ్గురువూ!" ★


## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయిత లకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకు తోంది. భావం ఏదైనా... కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చది వించగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతి రాతలో ఏడు అరఠావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా:

**ఆదివారం అనుబంధం**

ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ,

హైదరాబాద్-82.